క్లుప్తంగా

నేడు పట్టువస్త్రాల సమర్పణ

కృత్తివెన్ను: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ కృత్తివెన్ను శివాలయాన్ని దర్శిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు తెలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు.

పార్కు పనుల పరిశీలన

మచిలీపట్నంటౌన్: 44వ డివిజన్‌లోని మాకర్ల వెంకటస్వామినాయుడు మునిసిపల్ పార్కులో ఇటీవల జరిగిన అభివృద్ధి పనులను మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ శుక్రవారం పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు, వాటర్ ఫౌంటేన్లు, చిన్నారుల ఆట వస్తువులను పరిశీలించారు. డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెడన: పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ వారు విశాఖపట్నం జాలరిపేటకు చెందిన కోడూరు అరుణ్ ఈశ్వర్ వైద్యానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. అరుణ్ ఈశ్వర్‌కు ఓపెన్ హార్ట్ ఆపరేషన్ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, రౌతుల ప్రసాద్, సహాయ విశాఖ సభ్యుడు నారాయణ పాల్గొన్నారు.

21 నుంచి గ్రామోత్సవం

కోడూరు: భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 21వ తేదీన ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి శుక్రవారం తెలిపారు. 15 రోజుల పాటు గ్రామోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. 21న ఉదయం రామనీడు ఉత్సవం అనంతరం చిన్నఅమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. మార్చి 5న అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకారం, 6, 7 తేదీల్లో నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతర జరుగుతుంది. 8న చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశంతో ఉత్సవాలు ముగుస్తాయి.

కార్తికేయుని గ్రామోత్సవం

మోపిదేవి: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ, సిబ్బందితో స్వామివార్లను తొలుత ఆలయ ప్రదక్షిణ చేశారు.

బంగారు నాణెం అందజేత

పెడన: కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని అచ్చయ్యవారిపాలెం, బోడవరం గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల కోసం ప్రవేశపెట్టి కల్యాణమస్తు పథకం కింద బంగారు నాణెం (4 గ్రాములు)ను శుక్రవారం అందజేశారు. దిండి నాగరాజు కుమార్తె ప్రశాంతి, రావి సుబ్బారావు కుమారుడు నాగమల్లేశ్వరరావుల వివాహాన్ని పురస్కరించుకుని ఈ నాణెన్ని అందించామని జిల్లా పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్ తెలిపారు. పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, ఆయా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బంటుమిల్లి: విద్యార్థులు అత్యధిక మార్కులు, గ్రేడు పాయింట్లు సాధనే లక్ష్యంగా పెట్టుకుని చదవాలని బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పెదతుమ్మిడి ఉన్నత పాఠశాలలోని జూనియర్ ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని చదవాలని సూచించారు. హెచ్ఎం ధర్మారావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివరాత్రికి సర్వం సిద్ధం

- పుణ్యస్నానాలకు ఏర్పాట్లు
- ఆలయాలు ముస్తాబు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

మచిలీపట్నంటౌన్: మహా శివరాత్రికి మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల అలంకరణతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. పుణ్య స్నానాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. బందరు నగరంలోని పలు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి పితృదేవతలకు పిండప్రదానం చేసే వారి కోసం నగరంలోని నాగులేరు కాలువ గట్టుపై నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేసింది. కాలువలో స్నానాలు చేసిన అనంతరం పిండ ప్రదాన ఘట్టానికి టెంట్లను సిద్ధం చేశారు. ఇక్కడి ఏర్పాట్లను నగర పాలక సంస్థ డీఈ సాంబశివరావు, ఏఈ సతీష్‌చంద్ర పర్యవేక్షించారు. నగరంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రికి ఆలయంలోని 35 అడుగుల మహాశివుని విగ్రహం వద్ద విశేష పూజలు, మహా మంగళ హారతులు, తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది. నాగులేరు సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయం, గంగా అన్నపూర్ణాంబ సమేత సిద్ధి రసలింగేశ్వర స్వామి ఆలయం, ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయం, గాంధీబొమ్మ శివాలయం, గొడుగుపేట శివాలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు.

● గూడూరు: గూడూరు మండలంలోని శివాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కంకటావలో ప్రసిద్ధి చెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయ శాఖ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. తరకటూరు, మద్దిపట్ల, మల్లవోలు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.



బందరులోని రామలింగేశ్వర స్వామి ఆలయం

నేడు ఏకాదశ రుద్రాభిషేకం

పెడన: పట్టణంలోని పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని దేవదాయ శాఖ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు. శనివారం ఉదయం గణపతి పూజ, ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రి 12 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుందన్నారు.

● కోడూరు: మండలంలోని శైవక్షేత్రాలను ఆలయ కమిటీల నిర్వాహకులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దివిసీమలోనే అతిపెద్ద శివలింగంగా పేరుగాంచిన లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విభూదార్చన జరుగుతుందని ఈఓ సుధాకర్ తెలిపారు. హంసలదీవిలోని కాశీవిశ్వేశ్వర స్వామి, మాచవరంలోని రామలింగేశ్వరస్వామి, సాలెంపాలెంలోని అగస్త్యేశ్వరస్వామి, పిట్టల్లంకలోని బాలనాగేశ్వరస్వామి, వేణుగోపాలపురంలోని అమరలింగేశ్వర స్వామి వారి ఆలయాలను కూడా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉల్లిపాలెంలోని కృష్ణానది ఒడ్డున పితృదేవతలకు పిండప్రదానాలు చేసేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు.



పెదకళ్లేపల్లిలో కృష్ణానది ఒడ్డున ద్వాదశ లింగాల వద్ద శివలింగం

కృత్తివెన్నులో ఉత్సవాలు ప్రారంభం

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు శుక్రవారం విఘ్నేశ్వరస్వామి పూజతో ప్రారంభమయ్యాయి. కృత్తివెన్ను ఎస్‌ఐ గణేష్‌కుమార్ దంపతులు, ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు పూజల్లో పాల్గొన్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రాత్రి 10.45 గంటలకు స్వామివార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని అర్చకులు కోట మురళీకృష్ణ తెలిపారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మహాశివుని నివేదనకు అంతా సిద్ధం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శని త్రయోదశి కావడంతో మహా శివరాత్రికి కృష్ణానది ఉత్తర వాహినిలో పుణ్యస్నానాలు చేసేందుకు శనివారం తెల్లవారుజాము నుంచే ఉభయ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్‌బాషాతో కలిసి ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు క్యూలైన్ల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు.

కృష్ణానది వద్ద మూడు ఘాట్లలో స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. నది ఒడ్డున దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక రూములు, పితృదేవతలకు పిండ ప్రదానాలకు ప్రత్యేకంగా షామియానాలు సిద్ధంచేశారు. దేవస్థానం అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా భోజనాలు, మజ్జిగ, మంచినీళ్లు అందించనున్నారు. నదిలో బోట్లు, లైఫ్ జాకెట్స్‌తో గత ఈతగాళ్లను, 108 వాహనాలు, ఫైర్ వాహనం, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దేవస్థానం, కృష్ణానది వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు అవనిగడ్డ, మచిలీపట్నం, విజయవాడ, రేపల్లె నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ఆముదార్లంక(చల్లపల్లి): నిరుపేదల ఆర్థిక ప్రగతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం చల్లపల్లి మండలం ఆముదార్లంకలో సర్పంచ్ నడకుదుటి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గ్రామంలోని 200 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్సా సీపీ మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, ఎంపీటీసీ డొక్కు దేవేంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లబ్బాయి (చినబాబు), తుమ్మల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



మచిలీపట్నంటౌన్: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం 24వ డివిజన్‌లో జరిగింది. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ చిత్తజల్లు రాజుతో కలిసి ఆయన గడపగడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కుల,మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను జగనన్న ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత థామస్ నోబుల్, లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బలగం విజయశేఖర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ విమర్శలపై ఎమ్మెల్యే సింహాద్రి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: తొమ్మిది నెలల తరువాత చింతలమడ వెళ్లిన మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ తనపై విమర్శలు చేయడంపై ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతలమడ ప్రమాదం జరిగిన వెంటనే నేను ఘటనా స్థలికి వెళ్లి క్షతగాత్రులకు త్వరితగతిన వైద్యసేవలు అందేలా చూశానని, ప్రత్యేక డాక్టర్‌ను పిలిపించి మృతదేహాలకు పోస్టుమార్టం చేయించానని చెప్పారు. మట్టి ఖర్చులకు తన సొంత డబ్బులు ఇచ్చానని, మృతులకు ప్రభుత్వం సహాయం అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో తాను, తమ పార్టీ ప్రజాప్రజాప్రతినిధులు ప్రాణాలను లెక్క చేయకుండా కోవిడ్ బాధితులకు వైద్య సేవలు అందేలా చూశామన్నారు. ఆనాడు ప్రాణ భయంతో ఎక్కడ దాక్కున్నారో బుద్ధప్రసాద్ ప్రజలకు చెప్పాలని సింహాద్రి సవాల్ విసిరారు. కాంట్రాక్టు ఉద్యోగాలకు మీ మనుషులు డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మీ ఇంటికి ఎడ్లంక నుంచి ఇసుకను అక్రమంగా తరలించినపుడు మీకు, మీ నాయకులకు సీఆర్‌జెడ్ గుర్తుకు రాలేదా అని అన్నారు. మీ హయాంలో నిషేధిత జాబితా పేరుతో 17 వేల మంది రైతులను ముంచేశారని, మీ హయాంలోనే హర్యానా గేదెలను తీసుకొచ్చి గ్రౌండ్‌ని నాశనం చేసినపుడు మీ నాయకుల నోళ్లు ఎందుకు లేవలేదని విమర్శించారు. ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, మీరు చేసిన అవినీతి, అక్రమాలన్నింటినీ బయటకు తవ్వుతామని ఎమ్మెల్యే సింహాద్రి హెచ్చరించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు పత్రాలతో మేలు

గుడ్లవల్లేరు: వైఎస్సార్ జగనన్న రీ సర్వే అనంతరం ప్రభుత్వం రైతులకు ఇచ్చే భూహక్కు పత్రాలతో ఎంతో మేలు చేకూరుతుందని సర్వే శాఖ రాష్ట్ర కమిషనర్ సిద్ధార్థజైన్ అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరులో భూహక్కు–భూసర్వేపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. రైతులకు ఇచ్చే ఈ పత్రం ఆధార్ కార్డువంటిదన్నారు. దీనిద్వారా బ్యాంకు రుణాలు, ఆర్థిక సహకారాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జేసీ అపరాజితాసింగ్, ఆర్డీఓ పీ పద్మావతి, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ కనకదుర పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

పామర్రు: దాతల సహకారంతో నిరుపేదలైన వారికి ఆహారపు పొట్లాల పంపిణీ చేశామని పామర్రు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద 50 మంది పేదలకు ఆహారపు పొట్లాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెదపారుపూడి మండలం యలమర్రు గ్రామ వాస్తవ్యులు చెరుకూరి వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి భార్య అమ్మాజీ ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

కోడూరు: కోడూరు ప్రధాన సెంటర్‌లో పార్వతి సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఆలయ ట్రస్టీ ప్రారంభించింది. గతంలో ఉన్న స్వామివారి ఆలయం పల్లంగా మారడంతో కొద్దిపాటి వర్షానికే నీరు గర్భాలయంలోకి చేరుతోంది. దీంతో పాత ఆలయాన్ని కూలదోసి నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.ఆరు కోట్ల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ అన్నం వెంకటసుబ్బారావు తెలిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త శ్యామ్‌సుందర్ పర్యవేక్షిస్తారని చెప్పారు.

ఆలయ నూతన ట్రస్టీ ఎంపిక..

సోమేశ్వరస్వామివారి ఆలయానికి నూతన ట్రస్టీ చైర్మన్‌గా అన్నం వెంకటసుబ్బారావు, వైస్ చైర్మన్‌గా బూరగడ్డ హరినాథ్‌బాబు, కార్యదర్శిగా జూపూడి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారిగా అన్నం శివశంకర్, కార్యదర్శిగా తూనుగుంట్ల మహేష్‌తోపాటు సభ్యులను శుక్రవారం ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు యువకులను చిలకలపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఆర్. రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు వివరాలు తెలిపారు. మచిలీపట్నం ఇంగ్లిషుపాలెంకు చెందిన పేరవల్లి శరత్, బందరు మండలం నవీన్‌మిట్టల్ కాలనీకి చెందిన సింగంశెట్టి సాయిగోపీచంద్‌లు స్నేహితులు. అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో పెట్టి విక్రయించేవారు. మచిలీపట్నంలోని బస్టాండ్ సెంటర్‌లో పెడనకు చెందిన మట్టా భార్గవ్ అనే యువకుడికి గంజాయి ప్యాకెట్ అమ్ముతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం శరత్, గోపీచంద్‌ల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న శరత్, గోపీచంద్‌లతో పాటు గంజాయి సేవిస్తున్న భార్గవ్‌పై కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళం-గాజుల్లంక ప్రజావారధి ప్రారంభం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం–గాజుల్లంక ప్రజా వారధి శుక్రవారం ప్రారంభమైంది. గత ఏడాది కృష్ణానదికి వచ్చిన వరదలకు గతంలో వేసిన రహదారి కోతకు గురై కొట్టుకుపోయింది. శ్రీకాకుళం, గాజుల్లంక గ్రామస్తులంతా కలిసి మళ్లీ రహదారిని నిర్మించుకున్నారు. రహదారి నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావుకు రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు ఈ ప్రజా రహదారిని వినియోగించుకోవాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

కలెక్టర్ రంజిత్‌బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహ నిర్మాణాలు, ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి మండల స్థాయి అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి పెంచాలన్నారు. మండలం, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ప్రతి వారం ప్రగతి నివేదికలను అందజేయాలన్నారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిమానం పొందేలా పాలన

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల అభిమానం పొందేలా పాలన అందించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పంచాయతీ పాలకవర్గానికి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి కేక్ కట్ చేసి సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పాలకవర్గ సభ్యులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మంచి పాలన అందించి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈఓ తోట శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

19 నుంచి శిక్షణ

పెడన: పెడన నియోజకవర్గంలోని గృహ సారథులకు ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 19న ఉదయం 9 గంటలకు సుమ కన్వెన్షన్ హాల్‌లో గూడూరు మండలం వారికి, సాయంత్రం నాలుగు గంటలకు పెడన పట్టణంలోని వారికి శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ ఇస్తారని చెప్పారు. 20న ఉదయం పెడన మండలం వారికి పెడన మార్కెట్‌యార్డులోను, సాయంత్రం 3 గంటలకు బంటుమిల్లి మండలం వారికి బంటుమిల్లి మార్కెట్ కార్యాలయంలోను శిక్షణ ఇస్తారన్నారు. 21న సాయంత్రం 3 గంటలకు కృత్తివెన్ను మండలం గుడిదిబ్బ శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కార్నియాల సేకరణ

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక 11వ వార్డుకు చెందిన సజ్జా రామతులసమ్మ (77) శుక్రవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ మోటివేటర్స్ తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడగా విజయవాడకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల డాక్టర్ అమరుద్దీన్ మిత్ర బృందం రామతులసమ్మ కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు.

పోస్టల్ ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నంటౌన్: పోస్టల్ శాఖలో సిబ్బందిపై టార్గెట్లను విడనాడాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మచిలీపట్నం డివిజన్ పోస్టల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. పోస్టల్ ఉద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక డివిజన్ పోస్టల్ కార్యాలయంలో పనిచేస్తున్న సుంకర రవిప్రసాద్ టార్గెట్లతో ఒత్తిడికి లోనై ఈ నెల 16వ తేదీన గుండెపోటుతో మృతి చెందారని ఆరోపించారు.

విద్యార్థి గణేష్ మృతి బాధాకరం

కృష్ణా యూనివర్సిటీ వీసీ రామ్మోహనరావు

కోనేరుసెంటర్: యూనివర్సిటీ విద్యార్థి గణేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె. రామ్మోహనరావు అన్నారు. కృష్ణా యూనివర్సిటీ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎంసీఏ విద్యార్థి గణేష్ సంస్మరణ సభ శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించారు. గణేష్ చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామిరెడ్డి, విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మారుతి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ కుమార్, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు ప్రారంభంపై హర్షం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు పునః ప్రారంభించడంపై బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా నాయకుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. మచిలీపట్నము

బహిరంగ వేలము ప్రకటన

కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి. మచిలీపట్నము బ్రాంచినకు ఈ దిగువ తెలిపిన బకాయిదారుల నుండి బకాయిపడిన సొమ్ము రాబట్టుకొనుటకు D.R/O.S.D. గారి ద్వారా జారీ చేయబడిన **E.Ps** దాఖలా కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు, మచిలీపట్నం బ్రాంచి వద్ద ది. 22.02.2023వ తేదీ ఉదయము గం.11.30 ని.లకు క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని బహిరంగ వేలము వేయబడునని యిందు మూలముగా యావన్మందికి తెలియపర్చడమైనది.

వేలము వేయబడు బకాయిదారుని పేరు వారి యొక్క స్థిరాస్తుల వివరములు

వ. నెం.	ఇ.పి. నెం.	బకాయిదారుని పేరు, తండ్రి / భర్త	జామీనుదారుని పేరు	స్థిరాస్తి ఉన్న గ్రామము	ఆర్.యస్. నెం.	విస్తీర్ణము	సమయము
1.	322/2021-22	పిన్నింటి నవీన్ కుమార్ S/o. శ్రీనివాసరావు	వల్లా పాపమ్మ W/o. అప్పన్న	బలరామునిపేట మచిలీపట్నం	168/1	1296 చ॥ గజములు	ఉదయం గం. 11-30 ని.
2.	321/2021-22	పిన్నింటి శ్రీనివాసరావు S/o. రాములు	- - - -	ఈడేపల్లి మచిలీపట్నం	210	438 చ॥ గజములు	ఉదయం గం. 11-45 ని.
3.	318/2021-22	పిన్నింటి పవన్ కుమార్ S/o. రామస్వామి	చిలుకూరి కృష్ణశ్రీ W/o. ఫణికుమార్	బలరామునిపేట మాచవరం, మచిలీపట్నం	170/2	313+145 458 చ॥గ॥	మధ్యాహ్నం గం. 12-00 ని.
4.	324/2021-22	పిన్నింటి కమలకుమారి W/o. శ్రీనివాసరావు	- - -	ఈడేపల్లి మచిలీపట్నం	234 డోర్ నెం. 14/156-3	400 చ॥ గజములు	మధ్యాహ్నం గం. 12-15 ని.
5.	316/2021-22	దేను సూర్యప్రకాశరావు S/o. పాండురంగారావు	- - -	రామానాయుడుపేట మచిలీపట్నం	239 డోర్ నెం. 24/126	428 చ॥ గజములు	మధ్యాహ్నం గం. 12-30 ని.
6.	101/2018-19	చిన్నం ఈశ్వరచంద్ర విద్యాసాగర్ S/o. సముద్రుడు	- - -	పెడన	520/2ఎ 2బి, 3,4బి, 5ఎ, 5బి, 5సి, 6ఎ, 6బి,7బి,8, 9ఎ,9బి,1బి, 2డి,8సి,8డి, 508/1బి, 2డి,8సి,8డి	606.66 చ॥ గజములు	మధ్యాహ్నం గం. 12-45 ని.
7	358/2019-20	తిరుమలశెట్టి నరసింహస్వామి S/o. వెంకటేశ్వరరావు	- - -	తాళ్లపాలెం	34/11, 34/4	య.1.53 సెంట్లు	మధ్యాహ్నం గం. 01-00 ని.
8.	287/2018-19	బొంతూరి నాగమల్లేశ్వరరావు S/o. బి.పి. నాంచారయ్య	- - -	పాతరామన్నపేట మచిలీపట్నం	డోర్ నెం. 27/355	277.66 చ॥గజములు	మధ్యాహ్నం గం. 01.15ని.
9	325/2021-22	మహ్మద్ అలీ S/o. సాలేహ	- - -	జగన్నాథపురం మచిలీపట్నం	డోర్ నెం. 11/726	180.00 చ॥గజములు	మధ్యాహ్నం గం.01.30 ని.
10.	245/2019-20	సురవరపు చిన్నమ్మడు W/o. అప్పారావు	- - -	గొడుగుపేట మచిలీపట్నం	డోర్‌నెం. 9/70-1	187.34 చ॥ గజములు	మధ్యాహ్నం గం. 01-45 ని.
11.	201/2022-23	పూట్ల శ్రీనివాస్ S/o. వెంకటేశ్వరరావు	మరాడ నీలిమా రాణి W/o. రమేష్	చిలకలపూడి	458/1, 468/2ఎ	580.80 చ॥ గజములు	మధ్యాహ్నం గం. 02.30 ని.

వేలము షరతులు: 1. వేలము పాటలో పాల్గొనువారు రూ.1,00,000/- (అక్షరాల లక్ష రూపాయలు) ముందస్తు ధరావతుగా చెల్లించవలెను. (E.M.D.) ధరావతు చెల్లించు వారు ఆధార్ కార్డు – పాన్‌కార్డు జిరాక్సు జతపరచవలెను. వేలము పూర్తి అయిన తదుపరి ధరావతు సొమ్ము తిరిగి ఇవ్వబడును. 2. వేలము పాట పాడుకొన్న వారు పాట మొత్తములో రూ.100/-లకు రూ. 15/-ల చొప్పున వెంటనే డిపాజిట్ చేయవలెను. మిగిలిన మొత్తమును 15 రోజులలోపు పూర్తిగా చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల 15% తిరిగి ఇవ్వబడదు. 3. బహిరంగ వేలములో పాల్గొని హెచ్చుపాటదారు అయిన వారు స్టాంపు డ్యూటీని వారే చెల్లించవలెను. 4. వేలం జరిగిన తేది నుండి 30 రోజుల తర్వాత మాత్రమే సేల్ కన్ఫర్మేషన్ మరియు సేల్ సర్టిఫికెట్, డిప్యూటీ రిజిస్ట్రార్ / ఆఫీసరు ఆన్ స్పెషల్ డ్యూటీ వారి ద్వారా జారీచేయబడును. 5. ఎటువంటి కారణములు తెలుపకనే వేలమును వాయిదా వేయుటకు మరియు వేలమును రద్దు పరచుటకు సేల్ ఆఫీసర్ వారికి పూర్తి అధికారము కలదు. 6. ఆసక్తి కలిగిన వారు ఇతర వివరములకు బ్యాంకు పనిచేయు వేళల యందు ఈ క్రింది వారిని సంప్రదించగలరు.

బ్రాంచి మేనేజర్, కె.డి.సి.సి. బ్యాంకు, మచిలీపట్నంబ్రాంచి, సెల్: 9949688362

(సం/-) టి.రాఘవరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ / సేల్ ఆఫీసర్, కె.డి.సి.సి. బ్యాంకు లిమిటెడ్, నూజివీడు, సెల్ నెంబర్: 9848735350